క్లుప్తంగా

శుద్ధజలం ప్లాంట్ వినియోగంలోకి తెస్తాం

సాక్షి ఎఫెక్ట్

దహెగాం: మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుద్ధజలం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా 'సాక్షి'లో 'విద్యార్థులకు అందని శుద్ధజలం' అనే కథ నం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. శనివారం ఎంపీడీవో రాజేందర్ శుద్ధ జలం ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్ ఎన్ని రోజుల నుంచి పని చేయడం లేదని అడిగి తెలుసుకున్నారు. శుద్ధజలం ప్లాంట్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. త్వరలో వినియోగంలోకి తెస్తామని ఆయన తెలిపారు.

కోతుల బెడద నుంచి కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఇఫాత్ హుస్సేన్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా ప్రజలు కోతులతో ఇబ్బందులు పడుతున్నారని శనివారం అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్‌కు మాజీ వార్డు సభ్యుడు ఇఫాత్ హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. కోతులు ఇళ్లలోకి చొరబడి సామగ్రి ఎత్తుకెళ్తున్నాయని, ప్రజలపై దాడులు చేస్తున్నాయని అధికారులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

'బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి'



మాట్లాడుతున్న సతీశ్‌బాబు

రెబ్బెన: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో బీజేపీ బూత్‌స్థాయి కమిటీల నిర్వహణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బూత్ స్థాయి కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పదాధికారులు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, సునీల్ చౌదరి, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, రాష్ట్ర నాయకురాలు కృష్ణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు రాంబాబు, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'అన్ని విభాగాల పాత్ర కీలకం'



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణి పురోభివృద్ధిలో అన్ని విభాగాల పాత్ర కీలకమని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో బొగ్గు ఉత్పత్తి ఎంత కీలకమో సకాలంలో వినియోగదారులకు బొగ్గు అందించడం అంతే కీలకమన్నారు. సీహెచ్‌పీ ద్వారా గత సంవత్సరం జరిగిన బొగ్గు రవాణాతో పాటు ఈ సంవత్సరం జరిగిన రవాణాలను ఉద్యోగులకు వివరించారు. మరింత మెరుగైన డిస్పాచ్‌ల కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, సీనియర్ పీవో శ్రీనివాస్, ఇంజినీర్లు శ్రావణ్ పాల్గొన్నారు.

మీసేవ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ అధ్యక్షతన జిల్లా మీసేవ ఫెడరేషన్ కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డల సురేశ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, కిరణ్, కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా సంతోష్, సంయుక్త కోశాధికారిగా మతిన్, సభ్యులుగా హన్మంతు, రాకేశ్, మొయినొద్దీన్‌లను ఎన్నుకున్నారు.

కొత్త మెనూ ప్రారంభం

- జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో అధికారుల పర్యటన
- విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు



దహెగాం: కొత్త మెనూ ప్రారంభిస్తున్న ఎంపీడీవో, ఎస్సై

దహెగాం: వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన కొత్త కామన్ మెనూను కల్వాడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వసతి గృహాల్లో ఇక నుంచి ఒకే రకమైన మెనూ ఉంటుందన్నారు. ఎస్సై రాజు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భోజన మెనూను మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో శనివారం తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులతో, విద్యార్థుల సహపంక్తి భోజన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీడీవో అల్బర్ట్ మాట్లాడుతూ ప్రభుత్వం డైట్ చార్జీలను 40శాతం పెంచిందన్నారు. హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యార్థులు మెస్ చార్జీలను పెంచడంతో పాటు మెనూలో మార్పులు చేసింది. ఈమేరకు శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ఆయా వసతిగృహాల్లో భోజనం చేసి రుచి చూశారు. జోడేఘాట్, హట్టి, బాబేఝరి,అనార్‌పల్లి, రాంజీగూడ, మోడి, బీసీ హాస్టల్ కెరమెరిలను ప్రత్యేకాధికారులు సందర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా, డీటీ సంతోష్‌కుమార్, సీఐ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జైనూర్: విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మెనూను సీఐ రమేశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎస్సై సాగర్, ప్రధానోపాధ్యాయుడు భీంరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, బంబార ఆశ్రమ పాఠశాలలో తహసీల్దార్ రియాజ్ అలీ, చౌపన్‌గూడ ఆశ్రమ పాఠశాలలో ఎంఈవో శివచరణ్, వెల్గి ఆశ్రమ పాఠశాలలో డీటీ శ్రావణ్ కుమార్‌లు నూతన మెనూను శనివారం విడుదల చేశారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వార్డెన్ మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో కామన్‌డైట్ మెనూ అమలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌటాల బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్ పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎస్సై మధుకర్, వార్డెన్‌లు రేష్మ, అశోక్‌కుమార్, నాయకులు వాసు పటేల్, కలీం పాషా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నూతన మెనూ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన భోజనాలను అందజేసేందుకు కొత్త మెనూ తీసుకొచ్చిందన్నారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు నూ తన మెనూపై అవగాహన కల్పించారు. ఎస్సై చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెబ్బెన: కొత్త మెనూ ప్రారంభిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్సై చంద్రశేఖర్



కౌటాల: కామన్‌డైట్ మెనూ కార్యక్రమం ప్రారంభిస్తున్న అధికారులు



వాంకిడి: బీసీ హాస్టల్‌లో..



లింగాపూర్: ప్రారంభిస్తున్న తహసీల్దార్



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్



జైనూర్: పోచంలొద్ది బాలుర ఆశ్రమ పాఠశాలలో..



కెరమెరి: రాంజీగూడలో..

మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ సమీపంలో హైవే పక్కన నూతనంగా నిర్మించిన దారి మైసమ్మ దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నిమ్మకంటి సంతోష్ శర్మ, అర్చకులు చంద్రశేఖర శర్మ ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు తదితరులు పూజలు నిర్వహించి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయ ఆవరణలో శనివారం గోలేటి స్పోర్ట్స్ లయన్స్ క్లబ్, దేవార వినోద్ స్వామి ఆధ్వర్యంలో కీర్తి డెంటల్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య, దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ రౌతు వెంకటేశం, గోలేటి స్పోర్ట్స్ లయన్స్ క్లబ్ కార్యదర్శి అన్నం రమేశ్, కోశాధికారి చందర్, సలహాదారుడు మహేందర్‌రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, దంత వైద్యురాలు కీర్తి, కంటి వైద్య నిపుణులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ఆసిఫాబాద్‌అర్బన్: చెక్కు అందజేస్తున్న శ్యాంనాయక్



సిర్పూర్(టి): చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన జంబోజుల తిరుపతిచారికి రూ.30వేలు, వాంకిడి మండలం బెండారా గ్రామానికి చెందిన బాలాజీకి రూ.60వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీ, వెంకటేశ్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి, భూపాలపట్నం, టోంకిని, సిర్పూర్(టి), దుబ్బగూడ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. షిండే కుందాబాయి, తులసీదాస్, మనీష, సత్తయ్య, శంషున్నిసా బేగమ్‌లకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు నీరటి సత్యనారాయణ, వడ్డేటి నానయ్య, నేరెళ్ల అశోక్, పైడి విలాస్, బనార్కర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: ఆపద సమయంలో పేద ప్రజలకు అండగా సీఎం రిలీఫ్‌ఫండ్ నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మోడెం దుర్గాప్రసాద్‌కు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేసిన రూ. 60వేల చెక్కును బాధితుడికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవిగౌడ్, గోగర్ల రాజేశ్, అవిడపు గోపి, వెంకటేశ్వర్‌గౌడ్, రాజాగౌడ్, రమేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

జైనూర్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా శనివారం ఆయన అనుచరులు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దౌలత్‌రావు, బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ సలాం లక్ష్మిబాయి, సిర్పూర్(యూ) మాజీ సర్పంచి ఆత్రం మీనాబాయి, సిర్పూర్(యూ) మాజీ సర్పంచుల మండల అధ్యక్షుడు ఆత్రం జాలీంషావు, కమలాబాయిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పార్లమెంటు ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, ఆడ అమృత్, పెందూర్ ప్రకాశ్, కుమ్ర శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో 'దత్తజయంతి'



ఆసిఫాబాద్: ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దత్తజయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శిర్డీ సాయి మందిరంలో ఉదయం సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వారం రోజులుగా సామూహిక దత్త చరిత్ర పారాయణం చేశారు. ముగింపు సందర్భంగా ఉదయం ఆలయంలో అర్చకులు ఇందారపు మధూకర శర్మ, సాయి శర్మ ఆధ్వర్యంలో పుస్తక పూజ చేశారు. దత్త పౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.

జైనూర్‌లో..

జైనూర్: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని హరిభక్త పారాయన్ సోపాన్ మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని జామిని గ్రామ శివారులోని గుట్టపై దత్తాత్రేయ ఆలయంలో ఘనంగా దత్త జయంతి కార్యక్రమం నిర్వహించారు. దత్తాత్రేయుడికి పంచామృతాలతో క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గైనినాథ్ మహరాజ్, కిషన్ మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న పత్తిరైతులు, వాహనదారులు

సిర్పూర్(టి): యాజమాన్యం పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారిపై ఉన్న శ్రీరామ జిన్నింగ్ మిల్లు ఎదుట శనివారం పత్తి రైతులు, వాహనదారులు ధర్నా నిర్వహించారు. వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో విక్రయించేందుకు తెచ్చిన పత్తితో రైతులు రెండ్రోజులుగా క్యూలైన్‌లో ఉంటూ నిరీక్షిస్తున్నారు. శుక్రవారం జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు క్యూలైన్‌లో ఉన్న పత్తి వాహనదారులకు టోకెన్లు కేటాయించారు. అయితే శనివారం జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు నిలిపివేశామని, వాహనాలు అన్‌లోడ్ చేయలేమని నిర్వాహకులు తెలుపడంతో ఆగ్రహించిన రైతులు, వాహనదారులు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో జిన్నింగ్ మిల్లు యాజమాన్యం పత్తి కొనుగోళ్లను యథావిధిగా కొనసాగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాస్తారోకో కారణంగా ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది.

రైతుకు పరిహారం అందజేత



చెక్కు అందజేస్తున్న మజారొద్దీన్

కెరమెరి: వారం క్రితం నిశాని గ్రామంలో పులిదాడిలో ఆవుదూడ మృతి చెందగా బాధిత రైతు వాడై పితంబర్‌కు ఎఫ్ఆర్వో మజారొద్దీన్ శనివారం రూ.10 వేల పరిహారం చెక్కు అందజేశారు. మాజీ సర్పంచ్ కుము రం అంబారావు, అటవీ అధికారులు విజయప్రకాశ్, వెంకట్ ఉన్నారు.

కొనసాగుతున్న 'సమగ్ర' నిరవధిక దీక్ష



దీక్ష శిబిరంలో ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదోరోజుకు చేరింది. పీఆర్టీయూ టీఎస్, ఎస్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీజీజీఎల్ఏ సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తుకారాం, ఉపాధ్యక్షురాలు నాగసుధ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపినవారిలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఊషన్న, హేమంత్ షిండే, నాయిని శ్రీనివాస్, కమలాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఇందారపు బాలకిషన్, మాణిక్‌రావ్, సంజయ్, లక్ష్మణ్, తుకారాం, రమేశ్, తదితరులున్నారు. దీక్ష శిబిరంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం నాయకులు నగేశ్, గెడేకర్ సంతోష్, ఆమ్మె అనూప్, పవన్, సందీప్, నలంద, అరుణ, కవిత, వెంకటరమణ, సత్యనారాయణ, శ్రుతి కూర్చున్నారు.

ఘనంగా ఆకసం వార్షికోత్సవం



శంకర్‌కు పురస్కారం ఇస్తున్న ఆకసం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరం ఆవరణలో శనివారం ఆసిఫాబాద్ కవుల సంఘం 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కారెం శంకర్‌కు ఆకసం కవి కీర్తిశేషులు డాక్టర్ వనపర్తి తిరుపతి స్మారక పురస్కారాన్ని అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీత శంకర్ మాట్లాడుతూ.. కవి ప్రజల హృదయాలను గెలుచుకోవాలని, కవి యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి సామాజిక, సమకాలిన పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. సాహితీ కార్యక్రమాల ద్వారా కవులు ప్రజల్లో చైతన్యం రగిలించాలని సూచించారు. గౌరవ అతిథి రావుల రామన్న, కవి యాత్ర ప్రముఖుడు వెంకట్, ఆకసం అధ్యక్షుడు రమేశ్ వార్షికోత్సవ ప్రాముఖ్యత, సాహితీ సేవ గురించి వివరించారు. అనంతరం ఆకసం సంఘం కవులు అవధాని మాడుగుల నారాయణమూర్తి రచించిన అమ్మా శతకం, ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధా శతకం, దేవరాజు రేవతి రచించిన సుముఖని శతకం, శ్రీనివాస్ రాసిన 'నువ్వు నేను గోదారి' కవితా సంపుటిపై ఢిల్లీ విజయ్‌కుమార్, సంతోష్, సత్యనారాయణ, రాజేశ్వర్‌రావ్ సమీక్ష నిర్వహించారు. అనంతరం రచయితలు, సమీక్షకులు, అతిథులను ఆకసం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కవులు రాజన్న, వెంకటేశ్వర్లు, మధుకర్, వెంకట్రావ్, జ్యోతి, సరిత, శ్రీదేవి, నాగోరావ్, పెంటయ్య, కాంతమ్మ, సాహితీప్రియులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ కార్యవర్గం ఎన్నిక

తిర్యాణి: మండల గురుకుల పాఠశాలకు సంబంధించిన నూతన స్కూల్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎంసీ)ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడావి గుణవంత్‌రావు, ఉపాధ్యక్షులుగా మెంద్రపు వనిత, కోట్నాక కమలలతో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలి

నేరడిగొండ: డిమాండ్లు నెరవేర్చాలని ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1200 మంది సీఆర్టీలు ఆందోళన బాట పట్టనున్నారు. సీఆర్టీల యూనియన్ పిలుపు మేరకు ఈనెల 16నుంచి సమ్మె చేయనున్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చిన మంత్రి సీతక్కకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈనెల 16న ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో పాల్గొననున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్న తమకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు. సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయగా పరిశీలిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్, వినంత్రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమేశ్వర్ పవార్ పాల్గొన్నారు.